GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

HAPPY Independence DAY
# క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
## తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 13-3-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



### సంగారెడ్డిలో మొదలుకానున్న డిజిటల్
# హెల్త్ విప్లవం

- డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లా
- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- ప్రతి రోగికి డిజిటల్ హెల్త్ కార్డు, వైద్య చరిత్ర మొత్తం ఒకే డిజిటల్ ప్రొఫైల్‌లో
- త్వరిత చికిత్సకు ఆధునిక ఐటీ సదుపాయాలు ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసం కొత్త వ్యవస్థ
- 64 ప్రభుత్వ ఆసుపత్రుల్లో డిజిటల్ హెల్త్ కార్డులు రాష్ట్రానికి మోడల్‌గా నిలవనున్న సంగారెడ్డి ప్రాజెక్టు

8లో

### వేధింపుల ఆరోపణలు
# డాక్టర్‌కు డిప్యూటేషనేనా..?

ఇర్విన్ పీహెచ్‌సీలో వివాదం.. డాక్టర్‌పై చర్యలు ఎక్కడ..?
మహిళా సిబ్బందిపై వేధింపుల ఆరోపణలు. డాక్టర్‌ను కాపాడుతున్నారా?
తప్పు చేసిన డాక్టర్‌కు శిక్ష బదులు డిప్యూటేషనా..
ఇర్విన్ పీహెచ్‌సీ ఘటన..
వేధింపుల ఆరోపణలు వెలుగులోకి
డాక్టర్‌పై కఠిన చర్యల తీసుకోవాలని డిమాండ్..

4లో



# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి



- పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు.... రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- అర్హులైన పేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు
- వర్షాకాలం నాటికి మల్లాయిగూడెం బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి
- కూసుమంచి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి

6లో

# గచ్చిబౌలి కార్పొరేటర్‌గా బరిలోకి దేవరకొండ బాలకృష్ణ ప్రజా సంఘాల హర్షం..



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** సైబరాబాద్ నగరంలోని గచ్చిబౌలి డివిజన్‌లో ప్రజాసేవ లక్ష్యంగా ముందుకు వస్తున్న యువ నాయకుడు దేవరకొండ బాలకృష్ణ తన స్థిరమైన ఉద్యోగాన్ని వదిలి రాజకీయాలలోకి అడుగు పెట్టడం విశేషంగా మారింది. నానకరామ్‌గూడలోని కెనరా బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయన, ప్రజలకు మరింత దగ్గరగా ఉండి సేవ చేయాలనే సంకల్పంతో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఆయన రాజకీయ రంగప్రవేశం చేయడం గచ్చిబౌలి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన దేవరకొండ బాలకృష్ణ, ఆ పార్టీ తరఫున గచ్చిబౌలి కార్పొరేటర్ పదవికి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ..ప్రజాసేవ చేయాలనే తపన తనను ఈ నిర్ణయం తీసుకునేలా చేసిందన్నారు. ఉద్యోగం ద్వారా పరిమిత స్థాయిలో మాత్రమే సేవ చేయగలిగానని, కానీ ప్రజాప్రతినిధిగా మారితే ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి మరింత అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా గచ్చిబౌలి ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, కాలనీలలో మౌలిక వసతుల లోపం, డ్రైనేజ్ సమస్యలు, పార్కులు, పచ్చదనం పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. గచ్చిబౌలి ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, పలు కాలనీలలో ఇంకా మౌలిక సదుపాయాల కొరత ఉందని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శక పాలన అందించడం తన లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయ ప్రయాణానికి ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు అయిన పారదర్శకత, అవినీతి రహిత పాలన, యువతకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలు తనను బలంగా ప్రభావితం చేశాయని దేవరకొండ బాలకృష్ణ తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తన ధ్యేయమని, గచ్చిబౌలి అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. స్థిరమైన బ్యాంకు ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవ కోసం రాజకీయాలలోకి రావడం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులుఅభిప్రాయపడుతున్నారు. ప్రజల మద్దతుతో గచ్చిబౌలి డివిజన్‌ను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో దేవరకొండ బాలకృష్ణ తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రజా సంఘాల ప్రతినిధులు ఆయన నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసారు.



## ఘనంగా సర్పంచ్ ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం జన్మదిన వేడుకలు

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామం తెలంగాణ మలిదశ ఉద్యమ కారుడు పెద్దకాపర్తి గ్రామ సర్పంచ్, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం జన్మదినం సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో ఆశీర్వాదం తీసుకొని కేక్ కటింగ్ చేసినారు ఈ కార్యక్రమంలో కనకదుర్గ గుడి చైర్మన్ మారగోని ఆంజనేయులు, చిన్న కాపర్తి సర్పంచ్ ఆవుల సుందర్, బోగోను చెరువు సర్పంచ్ ఆశయ్య, వార్డు సభ్యులు కుర్రు యాదయ్య, సాగర్ల నాగరాజు, అరగంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు

## బ్యాంకులోన్లు చెల్లించి పునరుద్ధరించుకోవాలి

### తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ప్రశాంత్ కుమార్

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 12:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపురం గ్రామం గురువారం రోజున తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ప్రశాంత్ కుమార్ బ్యాంకు నుంచి లోన్లు తీసుకున్న లబ్ధిదారులను కలిసి వ్యవసాయ రుణాలు మరియు మహిళా సంఘాలు తీసుకున్న లోన్లు టైం ప్రకారం చెల్లించాలని సూచించారు. చెల్లించిన వారికి లోన్లు పునరుద్ధరించటం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ రుణాలు, మహిళా సంఘాలు తీసుకున్న లబ్ధిదారులను కలిసి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ యాకుబ్,వీబీకే ఎన్ సరిత,రైతులు, మహిళా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు మంగమ్మ, సునీత, తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల విద్యార్థుల్లో స్ఫూర్తి నింపిన శ్రీనివాస్ ఆచార్య 'విజయీభవ'..!

**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** గొల్లపల్లి మండల మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో లీడ్ ఇండియా రాష్ట్ర శిక్షణ సమన్వయకర్త తాడూరి శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో జరిగిన 'విజయీభవ' శిక్షణ కార్యక్రమం విద్యార్థుల్లో గొప్ప ఆత్మవిశ్వాసాన్ని నింపింది. పట్టుదలతో చదవడం, వినడం, రాయడం వంటి నైపుణ్యాలతో పాటు ఉన్నత లక్ష్యాలు ఎలా సాధించాలో ఆయన అద్భుతంగా దిశానిర్దేశం చేశారు. ఈ శిక్షణతో తనలో భయం పోయిందని, రాబోయే పరీక్షల్లో 600కి 590 మార్కులు సాధించి తీరుతానని 10వ తరగతి విద్యార్థిని సాయిల సింధుజ ధీమా వ్యక్తం చేసింది. భవిష్యత్తులో ప్రపంచం గర్వించే ఐపీఎస్ (ఖాకీ) ఆఫీసర్ అవుతానని ఆమె తెలిపింది. విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెంచి, వారి ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శనం చేసిన శ్రీనివాస్ ఆచార్యకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.





## ఘనంగా కాంగ్రెస్ నేత నరేష్ జన్మదిన వేడుకలు..

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** పార్టీ సీనియర్ నాయకుడు అనిల్ కుమార్ యాదవ్ అనుచరుడు నరేష్ జన్మదినం సందర్భంగా గురువారం కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనను కలసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా కార్యకర్తలు శాలువాల తో సత్కారించి కేక్ కట్ చేసి నరేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నరేష్ ఆయురారోగ్యాలతో పాటు పార్టీ లో మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేందర్ ( టీంకు ) పవన్, అంబు, నాగరాజు, పిల్లి అనిల్, సాయి,పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 4వ రోజు స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి




**సంస్థాన్ నారాయణపురం, మార్చి 12(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామంలో 4వ రోజు స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం భాగంగా 2వ వార్డ్ ,7వ వార్డ్ పాత, మురికి కాలువలు, రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు అనేకముగా ఉన్నాయి. గ్రామం శుభ్రం కోసం స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం 4వ రోజు ఏర్పాటుచేసి ప్రైవేట్ సిబ్బందితో శుభ్రం చేపిస్తున్న, నల్లాల బాయిని సందర్శించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు పందుల యాదగిరి గౌడ్ ,గునిగంటి రాజు, గ్రామపంచాయతీ కారోబార్ పున్నం యాదగిరి, గడ్డం గాలయ్య, పుచ్చుల కృష్ణయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు



# కాంగ్రెస్ పార్టీ పేదల ప్రభుత్వం

**యువజన కాంగ్రెస్ నాయకుడు బోడేపూడి రాజా**



**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** గత కొన్ని రోజులుగా వెలుగుమట్ల భూదాన భూమి వివాదంలో జరుగుతున్న పోరాటంలో పేదల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం నిలబడి వారిని గెలిపించింది . కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని నిరూపించింది . అర్హులైన నిరుపేదలకు కూలగొట్టిన స్థలంలోనే ఇంటి పట్టాలను మంజూరు చేస్తూ ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలతో ఇంటిని నిర్మించడం చాలా సంతోషకరంగా ఉందని మన ప్రియతమ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశానుసారం ఖమ్మం మంత్రులు బట్టి , తుమ్మల , పొంగులేటి కార్యచరణ చేపట్టి పేదల ఇంటికాలను నెరవేర్చారని పేర్కొన్నారు . హైడ్రామాను క్రియేట్ చేసి ప్రతిపక్ష నాయకులు ఎన్ని ఆటలు ఆడిన దానిని ఛేదించుకుంటూ మన ముగ్గురు మంత్రులు పేదల పక్షాన నిలబడ్డారు . భూదాన భూమి సమస్యలను గత టిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించిందని అన్నారు . ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కుల సంఘల నాయకులు వారి రాజకీయ పలుకుబడి కొరకు ఎన్నో ఎత్తుగడలు వేసి కాంగ్రెస్ ప్రభుత్వం మీద బురద చల్లే ప్రయత్నం చేశారు కొంతమంది సోషల్ మీడియాను వేదికగా చేసుకుని అదే పనిగా పెట్టుకున్నారు వారికి ఇదొక గుణపాఠం . ఈ కార్యక్రమంలో వీర , రామకృష్ణ లు పాల్గొన్నారు .

# జిల్లా కాంగ్రెస్ డాక్టర్స్ మెడికల్స్ హెల్త్ విభాగం చైర్మెన్ గా కాపా మురళి కృష్ణ



**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జిల్లా డాక్టర్స్ మెడికల్ & హెల్త్ విభాగం జిల్లా కాంగ్రెస్ పార్టీ చైర్మన్ గా డాక్టర్ కాపా మురళి కృష్ణ పదవీ స్వీకార కార్యక్రమం నిర్వహించనైనది.ఀఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టి పి సి సి కాంగ్రెస్ డాక్టర్స్ మెడికల్ & హెల్త్ విభాగం చైర్మన్ డాక్టర్ రాజీవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి పి సి సి డాక్టర్స్ & మెడికల్ హెల్త్ విభాగం రాష్ట్ర చైర్మన్ రాజీవ్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయిలో విస్తరించే భాగంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అత్యంత శ్రద్ధతో పని చేసే వ్యక్తిని సూచించడం శుభప్రదమని, టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి వర్యులు శ్రీధర్ బాబు,దామోదర్ రాజనరసింహ లకు ధన్యవాదాలు తెలుపుతూ, వారి సలహా సూచనల మేరకు అన్ని జిల్లాలలో డాక్టర్స్ సెల్ అధ్యక్షులను నియమిస్తున్నామని మొదటగా ఖమ్మం జిల్లా కు వచ్చానని , పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించడమే తన లక్ష్యంగా పనిచేస్తామని, ఈ జిల్లా లో కొత్తగా కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ మెడికల్ & హెల్త్ విభాగం చైర్మన్ కాపా మురళి కృష్ణ పదవికి వన్నె తెస్తారని వారికి కితాబు నిచ్చిన డాక్టర్ రాజీవ్. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ లు మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ మెడికల్ హెల్త్ విభాగం చైర్మన్ పదవీ స్వీకార కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్ రాజీవ్ కు, పదవీ స్వీకరణ గావిస్తున్న డాక్టర్ కాపా మురళి కృష్ణ కి అభినందనలు తెలిపినారు, డాక్టర్ గారు ఈ పదవికి వన్నెతేవాలని, పేద ప్రజలకు వైద్యం అందించటంలో ముందుండాలని తద్వారా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు,దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, వైరా అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు జిల్లా కాంగ్రెస్ నాయకులు మూడుముంతల గంగరాజు యాదవ్, దాసరి దానియేలు, రంగా జనార్ధన్,కిలారి అనిల్ కుమార్,వేల్పుల మురలి ఖమ్మం నగర ప్రముఖ వైద్యులు ,జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# దాణా బస్తాల భారం పాడి రైతు దివాళా..

**రాష్ట్ర ప్రభుత్వం దాణా బస్తాల ధర తగ్గించండి. .**

**పాడి రైతుల ఆవేదన. .**

**రంగారెడ్డి ప్రతినిధి (క్రైమ్ మిర్రర్ ):** పాడి పరిశ్రమ గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు స్థిరమైన ఆదాయ వనరుగా మారుతోంది. ముఖ్యంగా ఆవుల డైరీ నిర్వహణను సరైన విధంగా చేస్తే రైతులు మంచి లాభాలు పొందే అవకాశం ఉంది. అయితే పాడి రైతులకు పెద్ద భారంగా మారుతున్నది దాణా బస్తాల ఖర్చు అని రైతులు చెబుతున్నారు. ఆవులకు ఇచ్చే దాణా బస్తాల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పాడి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పాలు అమ్మి వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం దాణా కొనుగోలుకే ఖర్చవుతుండడంతో రైతులకు ఆశించిన లాభాలు రావడం లేదని పలువురు పాడి రైతులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాణా బస్తాల ఖర్చులు తగ్గించేలా చర్యలు తీసుకుంటే పాడి రైతులు ఆర్థికంగా బలపడతారని, పాడి రైతు నిజంగా ధనవంతుడు అయ్యే అవకాశం ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రైతులు తమ పొలాల్లోనే పచ్చి మేత పంటలు పండిస్తే దాణా ఖర్చు కొంతవరకు తగ్గుతుందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. నాపియర్ గడ్డి, జొన్న మేత వంటి పంటలు పెంచడం ద్వారా ఆవులకు అవసరమైన మేత లభించి ఖర్చులు తగ్గుతాయి. పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి దాణా ధరలను నియంత్రిస్తే గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతుల ఆర్థిక స్థితి మరింత మెరుగుపడుతుందని రైతులు కోరుతున్నారు.





## పదో తరగతి విద్యార్థులకు ఉచిత పరీక్షా ప్యాడ్లు, జ్యామెట్రీ బాక్స్‌ల పంపిణీ.

**రంగారెడ్డి ప్రతినిధి(క్రైమ్ మిర్రర్ ):** మాడ్గుల మండలం కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న 43 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు ,జ్యామెట్రీ బాక్స్‌లను మసున విష్ణు అందజేశారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి రేఖ విజ్ఞప్తి మేరకు ఈ సహాయాన్ని అందింజేషమని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాడ్గుల గ్రామ ఉప సర్పంచ్ సూదిని శరత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మండల స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ. 10,000 ,రెండో ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ. 5,000 నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తామని ఆయన ప్రకటించారు. విద్యార్థులు అడిగిన వెంటనే సహాయం అందించిన మసున విష్ణు కి ఉప సర్పంచ్ సూదిని శరత్ రెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారి రేఖ ధన్యవాదాలు తెలియజేస్తూ వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు లవ కుమార్, కొనాపురం రాజు, కేజీబీవీ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలిడ యువతకు అవగాహన ర్యాలీ

**కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గూడూరు, కృష్ణాపురం గ్రామాల్లో కార్యక్రమం**

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 12:** యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తూ కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. శీతాకాల ప్రత్యేక శిబిరం ఆరవ రోజు భాగంగా మిర్యాలగూడ మండలంలోని గూడూరు, కృష్ణాపురం గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగింది.ర్యాలీ సందర్భంగా విద్యార్థులు గ్రామాల్లో తిరుగుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు లోనవకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. అలాగే హెచ్ఐవీ-ఎయిడ్స్ వ్యాధిపై కూడా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జున్ రెడ్డి, నాగరాజు, డాక్టర్ రవీందర్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, శ్రీను, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎస్. శ్రీనివాసరావు, డాక్టర్ ఆర్. స్వప్నతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.





## ఎమ్మెల్యే సమక్షంలో పెళ్లిరోజు జరుపుకున్న

### పాలిమేర పరమేష్ సంగీత దంపతులు

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం చిన్న కాపర్తి గ్రామానికి చెందినకాంగ్రెస్ పార్టీ నాయకుడు పొలిమేర పరమేష్ సంగీత దంపతులు పెళ్లి రోజు వేడుకలు నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం సమక్షంలో కేక్ కటింగ్ చేయించుకొని , ఆశీర్వాదం తీసుకొని పెళ్లిరోజు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో చినకాపర్తి సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ సుధాబాలును సన్మానించిన బీసీ జేఏసీ నాయకులు



**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 12:** మిర్యాలగూడ మున్సిపాలిటీ 45వ వార్డు శాబునగర్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలును గురువారం స్థానిక బీసీ జేఏసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, కుటుంబ సభ్యులు,వార్డు ప్రజల తరఫున చైర్మన్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వారు ప్రశంసించారు. కార్యక్రమంలో 45వ వార్డు కౌన్సిలర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, సామాజికవేత్త పోలా యాదయ్య, ఆవుదారపు మురళి ముదిరాజ్, ఉబ్బపల్లి కాశయ్య, బంటు విజయలక్ష్మి వెంకటేశ్వర్లు ముదిరాజ్, నక్క పద్మ, ఖాజా, పోలా హైమావతి, దోనేటి ఆశోక్, కోలా రాంబాబు ముదిరాజ్, బంటు హన్మంత్, బంటు మేఘనా తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కల్వకుర్తి మున్సిపాలిటీ 16వ వార్డులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైనా సీసీ రోడ్ పనులను గురువారం కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ ప్రారంభించారు. పనులు నాణ్యతగా త్వరిత గతిన చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కల్వకుర్తి మున్సిపాలిటీని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చిన్న రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, నాయకులు నర్సింహా, రామకృష్ణ, బాల గౌడ్, బాల్ రెడ్డి, దామోదర్ గౌడ్, రాం పర్వతాలు, బంగారి, కేశవులు, శివ, యాదయ్య, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ఉద్యమాలకు సిద్ధం కావాలి

### ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ పిలుపు



**భువనగిరి, మార్చి 12(క్రైమ్ మిర్రర్):** మహిళల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ మహిళలకు అండగా ఉంటూ ముందుండి పోరాడుతుంది అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అని, మహిళల సమస్యల పరిష్కారానికి మహిళలందరూ ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ పిలుపునిచ్చారు. శుక్రవారం భువనగిరి మండల పరిధిలోని ముత్తిరెడ్డి గ్రామంలో ఐద్వా గ్రామ మహాసభ కొండ హైమావతి అధ్యక్షతన జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనురాధ పాల్గొని మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 1981 సంవత్సరంలో మహిళా సాధికారత, సామాజిక సమానత్వం కోసం, హింసకు వ్యతిరేకంగా ఏర్పడి మహిళల హక్కుల పైన పోరాడి అనేక విజయాలు సాధించిందని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం కోసం, విద్య కూడా మహిళలకు అందించాలని, బాల్య వివాహాలు నిషేధించాలని, పురుషులతో పాటు స్త్రీలకు ఆస్తి హక్కు ఉండాలని, వరకట్నం వేధింపుల నిరోధక చట్టం ఉండాలని, గృహహింస నిరోధక చట్టం ఉండాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం ఉండాలని, మహిళా కమిషన్లు ఏర్పాటు చేయాలని పోరాడి ఐద్వా విజయం సాధించింది అన్నారు. మహిళల సమస్యలే సంఘం సమస్యలుగా భావించి వారి తరఫున నిరంతరం పోరాడుతున్నది ఐద్వా సంఘమని తెలిపారు. బిజెపి పాలనలో రోజురోజుకు మహిళల మీద దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతున్నాయని వీటికి వ్యతిరేకంగా మహిళలందరూ పోరాటాలకు, ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఐద్వా మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వము రోజురోజుకు ప్రజల పైన భారాలు మోపుతూ నిత్యవసర వస్తువుల ధరలను పెంచుతూ పోవడం వల్ల పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ మధ్యకాలంలో గ్యాస్ ధర పెద్ద ఎత్తున పెంచడం చాలా దారుణమని అన్నారు. ధరలు పెరగడం వల్ల ప్రధానంగా మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధర, నిత్యవసర వస్తువుల ధరను తగ్గించాలని వారు డిమాండ్ చేసినారు. అనంతరం 16 మందితో నూతన ఐద్వా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఎడ్ల జ్యోతి, కార్యదర్శిగా కొండ హైమావతి, కోశాధికారిగా కొండమడుగు కావ్య, ఉపాధ్యక్షురాలుగా కొండమడుగు లక్ష్మి, పిన్నింటి హేమలత, సహాయ కార్యదర్శులుగా మెరుగు మహేశ్వరి, బొల్లెపల్లి భాను కమిటీ సభ్యులుగా ఎడ్ల రామలీల, కొండ సుజాత, ఆకారం తులసమ్మ, కొండమడుగు మమత, కొండ మంగమ్మ, బొజ్జ లక్ష్మి, బబ్బురి ఉపేంద్ర, మెరుగు సుశీల, బొజ్జ అలివేలు ఎన్నికైనారు.

# వేధింపుల ఆరోపణలు డాక్టర్‌కు డిప్యూటేషనేనా..

- ఇర్విన్ పీహెచ్‌సీలో వివాదం..
- డాక్టర్‌పై చర్యలు ఎక్కడ..?
- మహిళా సిబ్బందిపై వేధింపుల ఆరోపణలు.
- డాక్టర్‌ను కాపాడుతున్నారా?
- తప్పు చేసిన డాక్టర్‌కు శిక్ష బదులు డిప్యూటేషనా..
- ఇర్విన్ పీహెచ్‌సీ ఘటన..
- వేధింపుల ఆరోపణలు వెలుగులోకిడ డాక్టర్‌పై కఠిన చర్యల తీసుకోవాలని డిమాండ్..



**రంగారెడ్డి ప్రతినిధి(క్రైమ్ మిర్రర్ ):** మాడ్గుల మండల పరిధిలోని ఇర్విన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవలి కాలంలో విధులు నిర్వహించిన డాక్టర్ రఘురాం తీరు వివాదాస్పదంగా మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన విధులు నిర్వహించిన సమయంలో ఆశా వర్కర్లను భయభ్రాంతులకు గురిచేసిన ఘటన ఇంకా మరవకముందే, ప్రస్తుతం మహిళా వైద్య సిబ్బందిని కూడా వేధించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటనపై కొంతమంది సిబ్బంది జిల్లా స్థాయి సంబంధిత అధికారులకు సమాచారం అందించడంతో, డాక్టర్ రఘురాం మరియు మహిళా వైద్య సిబ్బందిని గుట్టుచప్పుడు కాకుండా డీఎంహెచ్ఓ కార్యాలయానికి పిలిపించినట్లు సమాచారం. అక్కడ డాక్టర్ రఘురాంను మందలించిన అధికారులు, ఆయనను షాద్‌నగర్ నియోజకవర్గంలోని బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డిప్యూటేషన్‌పై పంపినట్లు తెలుస్తోంది. అలాగే అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యుడిని ఇర్విన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపినట్లు మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక అధికారి తప్పు చేసినట్టు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినప్పుడు సాధారణంగా మెమో లేదా సస్పెన్షన్ విధించాల్సి ఉండగా, అతడిని కాపాడుతూ గుట్టుచప్పుడు కాకుండా మరోచోటికి డిప్యూటేషన్‌పై పంపడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు ప్రజలలో వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికైనా వేధింపులకు పాల్పడిన వైద్యుడిపై కఠిన చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓను గురువారం ఫోన్ ద్వారా పలుమార్లు సంప్రదించినా స్పందించలేదు.

# సిసి రోడ్డు పనులను ప్రారంభించిన ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఊరుకొండ):** ఊరుకొండ మండలం మాదారం గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నాయపల్లిలో బిజెపి మండల అధ్యక్షుడు రాజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి గురువారం సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ సహకారంతో రూ. 5 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ లక్ష్మారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పరశురాములు, ఉపాధ్యక్షులు వెంకటేష్, రవీందర్, బూత్ అధ్యక్షులు మల్లేష్, రవీందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శంకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీను, చలపతి తదితరులు పాల్గొన్నారు.



## మైనారిటీ మహిళలు ఆర్థికంగా ఎదగాలి : మంత్రి పొంగులేటి

**ఖమ్మం ( క్రైమ్ మిర్రర్ బ్యూరో):** మైనారిటీ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గురువారం కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద పాలేరు నియోజకవర్గానికి చెందిన 163 మంది ముస్లిం మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను, అలాగే మండలంలోని మస్జిద్ కమిటీలకు 350 రంజాన్ తోఫా గిఫ్ట్ ప్యాకెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో సుమారు 200 కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నామని, మహిళలు తమ నైపుణ్యంతో సంపాదన పెంచుకున్నప్పుడే కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడతాయని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే మైనారిటీల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తూ సర్వమత సౌభ్రాతృత్వం కోసం ప్రార్థించడం అభినందనీయమన్నారు. అల్లా దీవెనలతో మైనారిటీ సోదరుల కోరికలు నెరవేరాలని ఆయన కోరారు.

## బిజెపి అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ కు శుభాకాంక్షలు...

**మియాపూర్ క్రైమ్ మిర్రర్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన రవి కుమార్ యాదవ్ ను మియాపూర్ డివిజన్ కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రవికుమార్ యాదవ్ బిజెపి పార్టీ కి చేసిన సేవలను గుర్తించి ఈ పదవి ఇచ్చినందుకు అధిష్ఠాన వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన అండదండలతో మేము మరింత ఉత్సాహంగా పనిచేస్తామని గణేష్ ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు మరియు రాబోయే పార్టీ కార్యక్రమాలపై సవివరంగా చర్చించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో బీజేపీ నాయకులు ఎప్పటికప్పుడు ముందుండి పని చేస్తారని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని మరింత బలపరచడానికి కలిసి కట్టుగా పనిచేయాలని రవికుమార్ యాదవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సారా రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పటాన్ చెరు లో అంబరాన్ని అంటిన మహిళా దినోత్సవ సంబరాలు

- పటాన్ చెరు కు తరలి వచ్చిన మహిళాలోకం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..
- ఆలోచింపచేసిన ఉపన్యాసాలు..
- మార్పు ఇంటి నుండి మొదలు కావాలి
- ప్రతి మహిళా ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించాలి..
- ప్రత్యేక క్యాంపుల ద్వారా హెచ్.పి.వి వ్యాక్సిన్ పంపిణీ
- మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మార్చి 12:** పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సతీమణి గూడెం యాదమ్మ ల ఆధ్వర్యంలో గురువారం పటాన్ చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి. నియోజకవర్గ పరిధిలోని మహిళా ప్రజా ప్రతినిధులు, వేలాదిమంది మహిళలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ అంశాలపై ప్రముఖులచే ఉపన్యాసాలు, బహుమతుల పంపిణీ కార్యక్రమాలు అందరిని ఉత్సాహపరిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ... ఒక కుటుంబంలో మహిళా విద్యావంతురాలు అయితే ఒక తరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. సర్వైకల్ క్యాన్సర్ విముక్తి కోసం ప్రభుత్వం అందిస్తున్న హెచ్.పి.వి వ్యాక్సిన్ ను బాలికలతో మొదలు మహిళలందరూ వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన పక్షంలో పటాన్ చెరు నియోజకవర్గంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతి మహిళకు వ్యాక్సిన్ అందిస్తామని హామీ ఇచ్చారు. గత 25 సంవత్సరాలుగా పటాన్ చెరు కేంద్రంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆడ కూతురు ఉన్నత చదువులు చదువుకోవాలన్న సమున్నత లక్ష్యంతో పటాన్ చెరు పట్టణంలో కేజీ నుండి పీజీ వరకు ఆధునిక వసతులతో ప్రభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని కోరారు. జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి మాట్లాడుతూ... మహిళలు వంటిల్లు నుండి అంతరిక్షం వరకు తమ సత్తా చాటుతున్న నేటికీ గృహ హింసకు గురి కావడం బాధాకరమన్నారు. మహిళల పట్ల మార్పు తమ గృహాల నుండే మొదలు కావాలని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మహిళల ఆర్థిక సమృద్ధికి పెద్దపీట వేస్తూ వేల కోట్ల రూపాయలు కేటాయించారని గుర్తు చేశారు. ప్రముఖ



వైద్యులు, ఎమ్మెల్యే జీఎంఆర్ కోడలు గూడెం కిరణ్మయి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి మహిళా విజయం వెనుక ఎందరో మహిళల త్యాగం నెలకొని ఉందని తెలిపారు. మహిళ ఆర్థిక అభ్యున్నతి, ఉన్నత అవకాశాలు పొందాలంటే సంపూర్ణ సహకారం అందించాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కుటుంబానికి వెన్నెముకగా నిలిచే మహిళ తన ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం విధిగా ఆరోగ్య చికిత్సలు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్.పి.వి వ్యాక్సిన్ తప్పకుండా వేయించుకోవాలని కోరారు. అవసరమైన పక్షంలో జీఎంఆర్ ఫౌండేషన్ ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు మహిళల పట్ల ఏ విధంగా ప్రవర్తించాలో బాల్యం నుండే అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డాక్టర్ కవితా రెడ్డి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ఆర్తి, ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ, మాజీ జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి లు ప్రసంగించారు. మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# వంట గ్యాస్ ను ప్రజలకు అందుబాటులో ఉంచాలి

- సిపిఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్

**ఖమ్మం(క్రైమ్ మిర్రర్ బ్యూరో):** వంట గ్యాస్ ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సిపిఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ మండల కమిటీ సమావేశం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు రచ్చ నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బండి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వంట గ్యాస్ కొరత పేరుతో ప్రభుత్వం వినియోగదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ లో వంటగ్యాస్ సకాలంలో అందక విద్యార్థులకు అవసరమైన భోజన ఏర్పాట్లను తయారు చేయడంలో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యా సంవత్సరం చివరి దశలో పరీక్షల సమయంలో వంటలు సకాలంలో తయారు కాక విద్యార్థులతోపాటు నిర్వాహకులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. కొన్ని పాఠశాలలు, హాస్టల్స్లో వంట గ్యాస్ లేక బహిరంగ ప్రదేశాలలో వంట చెరుకు తెచ్చుకొని వంటలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించడంతోపాటు ప్రజలకు అవసరమైన వంటగ్యాసును అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి మూడు ఏళ్లు గడుస్తున్న ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలను విస్మరించి ప్రభుత్వ సొమ్మును



లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. యాసంగి సాగు చివరి దశకు చేరుకున్న నేటికీ రైతు భరోసాను రైతు ఖాతాలో జమ చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఖమ్మం వద్ద వెలుగుమట్లలో నిరుపేదలు కట్టుకున్న ఇండ్లను ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేయడం దుర్మార్గపు చర్య అన్నారు. ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో నేడు ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని పట్టాలు ఇస్తూ తిరిగి ప్రజల సానుభూతిని పొందేందుకు తంటాలు పడుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేయాలని లేనియెడల రానున్న కాలంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రజలందరిని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి, కట్టెకోల వెంకటేశ్వర్లు, భూక్య కృష్ణ, పగిడికత్తుల నాగేశ్వరరావు, బెల్లం లక్ష్మి, ఇంటూరి అశోక్, దండా సూర్యనారాయణ, ఎర్ర తిరుపతిరావు, దేగల వెంకటేశ్వరరావు, పెద్దిరాజు నరసయ్య, బలుసు ప్రమీల, బొడ్డు మధు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి(కడ్తాల్): కడ్తాల్ గ్రామపంచాయతీ గుర్గకుంట తండా కు చెందిన వాంకుడోవత్ దోళి అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. నిరుపేద కుటుంబం అని తెలుసుకున్న రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ గురువారం స్వయంగా మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం తన రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా తక్షణసాయంగా రూ. 5వేలు ఆర్థిక సాయం చేశారు. బాధ్యత కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ గిరిజన రాష్ట్ర నాయకులు హనుమా నాయక్ వార్డు సభ్యులు రవి నాయక్ మాజీ డైరెక్టర్ లయక్ అలీ నాయకులు సోమ్లా మోహన్ రవి మునిష్ హెచ్ఆర్ మహేష్ శీను జగన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## హృద్రోగికి పునర్జన్మ.. ఆఫ్-పంప్ బైపాస్ విజయవంతం

- యశోద హాస్పిటల్ లో అత్యాధునిక వైద్య సేవలు-
- యశోద హాస్పిటల్ లో క్లిష్టమైన ఆపరేషన్లు సైతం విజయవంతంగా చేశాం-
- గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ వెంగల్ రెడ్డి.

కోదాడ, మార్చ్ 12( క్రైమ్ మిర్రర్ )ఁ: తీవ్రమైన గుండె జబ్బుతో పాటు దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న 61 ఏళ్ల మహిళకు మలక్‌పేట్ యశోదా హాస్పిటల్‌లో అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడినట్లు ప్రముఖ గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ వెంగల్ రెడ్డి తెలిపారు. గురువారం కోదాడ పబ్లిక్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన రక్తనాళాల్లో అడ్డంకులు ఉండటం, షుగర్, బీపీ వంటి సమస్యల వల్ల ఈ కేసు అత్యంత ప్రమాదకరంగా మారిందన్నారు. గుండెను ఆపకుండా నిర్వహించే 'ఆఫ్-పంప్' పద్ధతిలో బైపాస్ శస్త్రచికిత్స చేసి రోగిని ప్రాణాపాయం నుంచి రక్షించామన్నారు. శస్త్రచికిత్స జరిగిన రోజే వెంటిలేటర్ తొలగించామని, ప్రస్తుతం ఆమె పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని వివరించారు. అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో ఎంతటి క్లిష్టమైన కేసులనైనా విజయవంతంగా పూర్తి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ అన్ని రకాల వసతులు, వైద్య బృందం ఉన్న ఆసుపత్రులలో చికిత్స చేసుకోవాలన్నారు. అతి త్వరలోనే జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులకు కోదాడలో మెగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం లక్ష్మణ్ శ్రీకాంత్, సీనియర్ మేనేజర్ వాసు కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..




# బస్వాపురం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు, ఇండ్లు కోల్పోయిన ప్రజలకు వెంటనే పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలి



- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ డిమాండ్

భువనగిరి, మార్చి 12(క్రైమ్ మిర్రర్): బస్వాపురం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు, ఇండ్లు కోల్పోతున్న ప్రజలకు పూర్తిస్థాయి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. గురువారం రాత్రి భువనగిరి మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో సిపిఎం శాఖ సమావేశం నరాల చంద్రయ్య అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడు తమ భూములను, వందలాది సంవత్సరాలుగా ఒక గ్రామంలో గూడును ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న ప్రజలు ఇతరుల అవసరాల కోసం, సాగునీరు కోసం సర్వం కోల్పోతూ ప్రాజెక్టు నిర్మాణానికి సర్వము అర్పించిన నేటికీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు. బస్వాపురం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 20 సంవత్సరాలు గడుస్తున్న నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం అందించుటలో మాత్రం పాలకులు పూర్తిగా విఫలమైనారని విమర్శించారు. మరో పక్క పెండింగులో ఉన్న ప్రాజెక్టు నిర్మాణానికి రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వము ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణానికి, నిర్వాసితులకు 500 కోట్ల రూపాయలు కేటాయించి విడుదల చేయాలని నర్సింహ్మ కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు అన్నంపట్ల కృష్ణ, మండల కమిటీ సభ్యులు మధ్యపురం బాల్ నరసింహ, శాఖ కార్యదర్శి మచ్చ భాస్కర్, సహాయ కార్యదర్శి రాసాల దేవేందర్, సభ్యులు ఉడుత విష్ణు, ఎండి. బాబు, ఉడత వెంకటేష్, ముదిగొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

క్రైమ్ మిర్రర్ ఖమ్మం ప్రతినిధి : పాలేరుమార్చి-12 పేదలు ఆత్మ గౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి కూసుమంచి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.ముందుగా పాలేరు గ్రామంలో మంత్రి వర్యులు పర్యటించి 5 కోట్లతో పాలేరు సరస్సు వద్ద చేపట్టనున్న పర్యాటక సౌకర్యాల అభివృద్ధి పనులకు, మల్లాయి గూడెం గ్రామంలో మల్లాయిగూడెం నుండి ఆంజనేయస్వామి దేవాలయం వరకు కోటి 35 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, గట్టుసింగారం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ నియంత్రికల మరమ్మతుల కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాలేరు లేక్ ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, ప్రజలు, పర్యాటకులు ఆహ్లాదంగా గడిపే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. లేక్ దగ్గర చేపట్టే పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్లాన్ పరిశీలించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు.రాబోయే వర్షాకాలం నాటికి మల్లాయి గూడెం గ్రామంలో కోటి 35 లక్షలతో చేపట్టిన బిటి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. గ్రామాలకు గత నెలన్నర రోజులలో నిధులు విడుదలయ్యాయని, మార్చి 31 లోపు మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.గ్రామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని అన్నారు. మల్లాయిగూడెం గ్రామ పరిధిలో దాదాపు 13 కోట్ల రూపాయలతో ఇప్పటి వరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.పేదలకు నూతన రేషన్ కార్డులు పంపిణీ, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లను తప్పనిసరిగా మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆడ బిడ్డలు ఎంత దూరం ప్రయాణం చేసిన ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించామని, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందించామని తెలిపారు. గట్టుసింగారం గ్రామంలో పట్టాలు లేకుండా నిరుపేదలు ఎవరైనా ఉంటే క్షేత్ర స్థాయిలో విచారణ చేసి పట్టాలు అందించాలని అన్నారు. రాబోయే వేసవి కాలంలో త్రాగు నీటి ఇబ్బందులు రాకుండా బోరు మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు ఈ ప్రభుత్వం చేస్తుందని చెప్పారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మల్లాయిగూడెం నుంచి ఆంజనేయస్వామి టెంపుల్ వరకు కోటి 35 లక్షల రూపాయలతో చేపట్టిన బి.టి రోడ్డు నిర్మాణ పనులకు నేడు మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందని, రాబోయే వానాకాలం కంటే ముందే ఈ పనులు పూర్తిచేసి ప్రజలకు రోడ్డును అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్, పాలక వర్గానికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలుపుతూ రాబోయే ఐదు సంవత్సరాలు బాగా పనిచేసి ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం గట్టు సింగారం వద్ద ఆసుపత్రి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రవి కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మే ఒకటి నాటికి ధర్మారెడ్డిపల్లి కాలువను పూర్తి చేసి సాగు నీరు అందించాలి

- కాలువ మరమ్మత్తు పనుల నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి
- చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ముందు సిపిఎం ధర్నా



**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** మే ఒకటి నాటికి ధర్మారెడ్డి పల్లి కాలువ పనులను పూర్తి చేసి సాగునీరు అందించాలని కాల్వ మరమ్మత్తు పనుల నిర్మాణంలో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గోకారం, సంగెం,వర్కట్ పల్లి,జాలు కాలువ,జై కేసారం,గ్రామాలకు చెందిన సిపిఎం నాయకులు రైతులు చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం అందుబాటులో ఉన్న డివిజన్ పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు,సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామిలు మాట్లాడుతూ ధర్మారెడ్డిపల్లి కాలువ మరమ్మత్తుల కోసం ధర్మారెడ్డిపల్లి కత్వ నుండి గోకారం రామసముద్రం చెరువు వరకు సుమారు 17 కిలోమీటర్ల మేరకు ప్రభుత్వం నిధులను విడుదల చేస్తూ కాంట్రాక్టర్ కు పనులు అప్పగించిందని కానీ నవంబర్ 22 వ తారీకు రోజు ప్రారంభమైన మరమ్మత్తు పనులు ఐదు నెలలు గడుస్తున్న నేటికీ 20% పనులు కూడా పూర్తి కాలేదని ప్రధానంగా ధర్మారెడ్డిపల్లి కత్వ వద్ద ఏర్పాటు చేయాల్సిన గోడ నిర్మాణం మరియు తలుపులకు సంబంధించిన పనులు కనీస ప్రారంభానికి నోచుకోలేదన్నారు, దీనివల్ల వలిగొండ రామన్నపేట మండలాల పరిధిలోని 8 గ్రామాలకు చెందిన సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టు 40 కోట్ల వరకు ఇప్పటికే రైతులకు నష్టం జరిగిందని కాంట్రాక్టర్ మరియు అధికారుల నిర్లక్ష్యం వల్ల నత్త నడకన కొనసాగుతున్న కాల్వ పనులు మరో పంట రైతులకు నష్టం చేసే విధంగా ఉందన్నారు ప్రభుత్వం అధికారులు స్థానిక భువనగిరి ఎమ్మెల్యేలు వెంటనే స్పందించి త్వరతిగతిన పనులు పూర్తి చేసేందుకు మే ఒకటి నాటికి సాగునీటి అందించేందుకు తక్షణ చర్యలు చేపడుతూనే పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలను రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాగిరుక్రిష్టయ్య,మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, సిపిఎం మండల కమిటీ సభ్యులు భీమనబోయిన జంగయ్య, పొట్ట శ్రీనివాస్,నాయకులు నారి రామస్వామి, కొండూరు సత్తయ్య,ఏనుగు ప్రభాకర్ రెడ్డి,నారి జంగయ్య,రాపోతు వెంకులు,రోండి మల్లేశం,ఇంద్రారెడ్డి, నారి వెంకటేష్,దేశపాక రవి,రాపోతు నవీన్,బండమీది సుందరయ్య,నల్లగంటి శంకరయ్య,నకరికంటి మహేందర్, దుబ్బ నరసింహ,గుండు ముత్తయ్య,సిర్పంగి ఎల్లయ్య,తదితరులు పాల్గొన్నారు

# మోడల్ కాలనీ గా వెలుగుమట్లను తీర్చిదిద్దుతాం... రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు

- ఉగాది లోపు విద్యుత్ సరఫరా పనులు పూర్తి
- పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా చర్యలు
- వెలుగుమట్ల భూదాన్ భూములలో 38 ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం ప్రతినిధి మార్చి 12:** తెలంగాణ రాష్ట్రంలోనే మోడల్ కాలనీగా వెలుగుమట్లను తీర్చి దిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం వెలుగుమట్ల భూదాన్ భూములలో 38 ఇండ్ల నిర్మాణ పనులకు ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ పేదరికం ఆసరా చేసుకొని ధనార్జన కోసం దళారులను అడ్డుపెట్టి ఇతర జిల్లా, రాష్ట్రాల వారిని రెచ్చగొట్టి ఫేక్ డాక్యుమెంట్ లతో భూమి పేదలకు మోసపూరితంగా అప్పగించారని తెలిపారు. 1953 లో ఆసామి 31 ఎకరాల 7 గుంటల భూమి దానం చేశారని తెలిపారు. గత 8 సంవత్సరాల కాలంలో అనేక సమస్యలు పేదలు ఎదుర్కొన్నారని, త్రాగునీటి, విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పన లేకుండా బాధలు పడ్డారని తెలిపారు. కరెంట్, మంచి నీరు ప్రతి అంశానికి డబ్బులు డిమాండ్ చేస్తూ మాఫియా నడిపించారని మంత్రి తెలిపారు. పేదలను దిన దిన గండం నుంచి కాపాడాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించిందని అన్నారు. భూదాన్ భూములు ఆక్రమించుకోవాలని సిసిఎల్ఏ ఇచ్చిన ఆదేశాల ప్రకారం కూల్చివేతలు జరిగాయని అన్నారు. మోడల్ కాలనీగా వెలుగు మట్లను తీర్చి దిద్దుతామని, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించిన తల్లి సోనియాగాంధీ పుట్టిన రోజు డిసెంబర్ 9 నాటికి కాలనీ పూర్తి చేస్తామని తెలిపారు. పేదలకు పంచిన తర్వాత మిగిలిన భూమిలో స్కూల్, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. నిరుపేదలకు సున్నా వడ్డీతో రుణాలు అందిస్తామని తెలిపారు. పేదలకు ఇంటి నిర్మాణంలో హౌసింగ్ శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. వెలుగుమట్ల లేఔట్ లో కరెంటు పోల్స్, విద్యుత్ సరఫరా పనులు యుద్ధ ప్రాతిపదికన ఉగాది లోపు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా త్రాగునీటి పైప్ లైన్ పనులు చేపట్టాలన్నారు. దళారులకు ఎవరు ఎంత డబ్బులు ఇచ్చారు వివరాలు పోలీసు అధికారులకు అందించాలని అన్నారు. ప్రజలను మోసం చేసిన ఎవరిని విడిచి పెట్టే సమస్య లేదని కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, హౌజింగ్ పిడి శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# అత్యుత్తమ సేవలకు గాను సుధా బ్యాంకుకు 5 స్టార్ రేటింగ్

- ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం-
- మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్.

**కోదాడ, మార్చి 12( క్రైమ్ మిర్రర్):** తమ బ్యాంకు ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను అంతర్జాతీయ హై క్వాలిటీ హైమ్ రేటింగ్ సంస్థ ఫైవ్ స్టార్ రేటింగ్ ప్రకటించిందని సుధా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ తెలిపారు. గురువారం కోదాడ పట్టణంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 26 ఏళ్లుగా 300 కోట్ల టర్నోవర్ తో 9 శాఖలలో ఖాతాదారులకు నమ్మకమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం రుణాలు ఇచ్చి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నామన్నారు. కమర్షియల్ బ్యాంకులకు దీటుగా తక్కువ వడ్డీకే బంగారం, ఇండ్లు, వ్యక్తిగత, వ్యాపార రుణాలు అందిస్తున్నామని ఇట్టి అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో చైర్మన్ మీలా మహాదేవ్,వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్ర శేఖర్,డైరెక్టర్ లు తోట శ్యామ్, స్వామి వెంకటేశ్వర్లు,ఇరుకుల్ల చెన్న కేశవ రావు, వెంపటి వెంకట రమణ,బ్యాంక్ మేనేజర్ చెన్నూరు. రవి కుమార్, మరియు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# పబ్లిక్ టాయిలెట్ నిర్మాణంపై స్థానికుల అభ్యంతరం

- టాయిలెట్ వద్దు.. ఇబ్బందులు పడలేం
- 25వ వార్డు ప్రజల ఆందోళన.

**కోదాడ, మార్చి 12( క్రైమ్ మిర్రర్):** కోదాడ పట్టణంలోని 25వ వార్డు చేపల మార్కెట్ సమీపంలో పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ ప్రతిపాదనపై వార్డు కౌన్సిలర్, స్థానికులు మండిపడుతున్నారు. గత పదేళ్లుగా వినియోగంలో లేని పాత టాయిలెట్‌ను కూల్చివేసిన అధికారులు, అదే స్థలంలో మళ్లీ కొత్తది నిర్మించాలని చూడటం సరికాదన్నారు. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు, మద్యం సేవించడం వంటివి సాగుతున్నాయన్నారు. ఇరుకైన గల్లీ కావడంతో వర్షం వస్తే నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ నుంచి బస్టాండ్ వరకు పలు టాయిలెట్లు అందుబాటులో ఉన్నాయని అవే వాడకంలో లేవని వార్డులో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయమంటే నిధులు లేవని చెప్పే కమిషనర్ ప్రజలకు ఉపయోగపడని చోట నిధులు ఖర్చు చేయడం దుర్వినియోగమేనని విమర్శించారు. తమ అభ్యర్థనను కాదని ఇక్కడ టాయిలెట్ నిర్మించాలని చూస్తే ఊరుకోమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో టాయిలెట్ నిర్మించకుండా అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ బాబా తాబుసం, జంపాల భద్రయ్య, భూలక్ష్మి, రామకృష్ణ, శ్రీనివాసరావు, మజీద్, ముత్యాలరావు, జాన్ బీ తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డిలో మొదలుకానున్న డిజిటల్ హెల్త్ విప్లవం



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మార్చి 12:** రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ వ్యవస్థను అమలు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన, అమలుపై రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంగారెడ్డి జిల్లాను పైలెట్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో ప్రాజెక్టు అమలు విధానం, అవసరమైన సాంకేతిక సదుపాయాలు, ముందస్తు ఏర్పాట్లపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టు కింద సంగారెడ్డి జిల్లాలోని మొత్తం 64 ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించారు. ఇందులో జీజీహెచ్1, ఏరియా ఆసుపత్రులు4, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు5, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు4, ప్రైమరీ హెల్త్ సెంటర్లు31, బస్తీ దవాఖానాలు19 ఉన్నాయి. రోగి ఆసుపత్రికి వచ్చిన మొదటి దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ఓపీ, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్, ఫార్మసీ వంటి అన్ని విభాగాల్లో రోగి వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా ఐటీ సదుపాయాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని మంత్రి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యకు సూచించారు. డిజిటల్ హెల్త్ కార్డు ద్వారా రోగి పూర్తి వైద్య చరిత్ర అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు తక్షణమే సరైన చికిత్స అందించడానికి సౌలభ్యం కలుగుతుందని మంత్రి తెలిపారు. అలాగే క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి అవసరమైతే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు రిఫర్ చేయడానికి ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో అమలు చేసే ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ హెల్త్ కార్డును అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చొంగ్తు, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో ఉదయ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 14 నుండి పదో తరగతి పరీక్షలు...

- పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి .
- మండల విద్యాధికారి సలీం షరీఫ్

**కోదాడ మార్చి 12 ( క్రైమ్ మిర్రర్ ):** కోదాడ పట్టణంలో ఈనెల 14 నుండి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాధికారి సలీం షరీఫ్ తెలిపారు. విద్యార్థులు ఎవరు ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. కోదాడ పట్టణంలో 11 పరీక్ష కేంద్రాల్లో లోటుపాట్లు తలెత్తకుండా, కట్టదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లను అనుమతించడం లేదని, పరీక్ష కేంద్రానికి సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించామన్నారు. పట్టణంలో 1485 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 130 మంది సిబ్బంది తో, 11 సెంటర్లలో 22 మంది చీఫ్ సూపర్డెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి సెంటర్ కి పోలీస్ బందోబస్తు ఉంటుందని, పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, అవసరమైన ఫర్నిచర్తో పాటు వైద్య సేవలను అందుబాటులో ఉంచుతున్నాం అన్నారు. విద్యార్థులు ఆందోళనకు గురి కావద్దు.. విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి గురై ఆందోళన చెందవద్దని ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. తల్లిదండ్రులు ప్రశాంత వాతావరణం కల్పించాలని ఒక గంట ముందు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఐదు



నిమిషాలు ఆలస్యమైనా పరీక్షకు అనుమతిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలను సీసీ కెమెరాల ఎదుటే తెరిచేలా ఏర్పాటు చేశామని ప్రతి పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు ముఖ్య గమనిక... కోదాడ హై స్కూల్ భవాని నగర్ అడ్రస్ కోదాడ హై స్కూల్ (ఖుా) అశోక్ నగర్, విజయవాడ రోడ్డులో ఉంటుందని, ఆక్స్ఫర్డ్ హై స్కూల్ హుజూర్ నగర్ రోడ్డు లోని భారతి విద్యా మందిర్ పక్కన కలదని, ఎస్ వి హై స్కూల్ భవాని నగర్ నందు ప్రభుత్వ ఆసుపత్రి ఎదురు సందులో ఎస్వీ కాలేజ్ దగ్గర కలదని పదవ తరగతి విద్యార్థులకు ముందస్తుగా తెలియజేయాలని తెలిపారు.



## స్వర్ణ భారతి ట్రస్ట్ సేవలు అభినందనీయం

- నల్లబండగూడెంలో మెగా వైద్య శిబిరం.. 400 మందికి పరీక్షలు.

**కోదాడ రూరల్, మార్చి 12( క్రైమ్ మిర్రర్):** పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ కృషి అభినందనీయమని సర్పంచ్ అలసకాని భవాని శరభేశ్వరరావు అన్నారు. గురువారం నల్లబండగూడెం గ్రామంలో చక్కా చన్నయ్య జ్ఞాపకార్థం ఐషు ప్రొడక్ట్స్ అధినేత చక్కా హరిబాబు సహకారంతో యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో దాదాపు 400 మందికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో మరియు థైరాయిడ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సామాజిక సేవలో స్వర్ణ భారతి ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా పైడిమర్రి సత్యబాబు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల ప్రవీణ రాజశేఖర్, ఓరుగంటి కిట్టు,యధా సుధాకర్,ట్రస్ట్ సభ్యులు హైమావతి, శ్రీనివాసరావు, కొత్తూరి శ్రీనివాసరావు,అనిల్ గ్రామ పెద్దలు వైస్ సర్పంచ్ యరమల అరుణ, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ సుశీల బెంజిమన్, రంగారావు గారు,నల్లపాటి నరసింహారావు,సుధాకర్,ముంద్ర శివరామ కృష్ణ మొదల రాజా ఎదులాపు నరసింహారావు, ముంద్ర సీతయ్య మాగంటి ముత్తయ్య,బోయిల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మార్చి 12:** రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా ఆధునిక వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్ సముదాయ ఆవరణలో ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు మినీ ట్రాక్టర్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎస్సీ, ఎస్టీ రైతులకు ఒక్కోటి రూ.4.9 లక్షల విలువ గల 20 హెచ్పి కెపాసిటీ మినీ ట్రాక్టర్లను 60 శాతం సబ్సిడీతో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వ్యవసాయం, ఉద్యాన రంగాల అభివృద్ధికి యాంత్రీకరణ ఎంతో అవసరమని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతులు ఆధునిక పద్ధతులు, యంత్రాలను వినియోగించి సాగు ఖర్చును తగ్గించుకోవడంతో పాటు ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. రైతుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని, రైతులకు అండగా ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావు, డీఆర్డీఓ జ్యోతి తదితర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.